కథా నిలయం
3594
శ్రీకాకుళం

# కలకలలాడే ముఖాలు

ఇంజినీరింగ్ చదువువలన చాలా లాభాలున్నాయి. వాటిలో మొదటిది పొద్దునే నిద్దుర లేవడం!

1955 లో మన కాలేజీ మొదలైంది. అప్పుడు మా క్లాసులు ఉదయం 7-30కి ప్రారంభమై 7-40కి ఓ రోజూనా, సాయంత్రం 4-30 కి ఓ రోజూనా; అలా రకరకాలుగా ముగిసేవి. టీచర్లు లేకపోవటానా, కొందరు తొందరగా నిద్రలేవకపోవటానా అలా జరిగినా మేం నిద్రలేవక తప్పదుగా. అప్పుడు మా హాస్టల్సు వార్ షెడ్సే; ఇప్పుడు రిసెర్చి స్కాలర్ హాస్టల్ ఉన్నచోట, క్లాసులు జె.వి.డి.లో. రూంనుంచి క్లాస్‌కి రెండు నిమిషాలు నడక. అయినా వర్షంవస్తేచాలు క్లాసు మానేసేవాళ్లం. వర్షంలో నడవడం సరదాలేకకాదు. మా రూముల్లో కూడా వర్షం కురుస్తుందికదా, అలాంటప్పుడు బయట తడవడం ఎందుకూ అని !

అలా మేమందరం ఐకమత్యంగా క్లాసులు మానేసినా సివిల్ ప్రొఫెసర్ డా॥ వి. జగన్నాథరావు (అప్పుడు ప్రొఫెసర్ కాదు, నా క్లాస్‌మేట్ మాత్రమే) మాత్రం వర్షంలోనే ఓ రోజు క్లాస్‌కి వెళ్ళాడు. అతనికి మరో ఇద్దరు తోడు. ముగ్గురూ క్లాస్‌కి వెళ్ళాక అక్కడ నిద్రపోతున్న లెక్కల మాస్టారు వాళ్ళముగ్గుర్నీ ఛెడామడా, మడాఛెడా తిట్టేశారు. నిజానికి మాకు రావలసిన తిట్లు అవి; వాళ్ళు కొట్టేశారు. లోకంలో న్యాయం ఎక్కడుంది?

ఉదయం 7-30 కి క్లాసు తీసుకోడం మాటలా ఉంచి, నిద్రలేవటమే అలవాటులేని లెక్కలు, సైన్సు మేస్టార్లు మాకోసం నడుం బిగించి పొద్దున్నే వచ్చేసి క్లాసులు తీసేసుకునేవారు. మాకు అప్పుడు ఒక ఇంజనీరింగ్ మేస్టారు కూడా ఉండేవారు. శ్రీ డి. సీతాపతిరావు. ఆయనే మన కాలేజీ నిర్మాత. ఆయనికి హిట్లర్ అని ముద్దు పేరొచ్చింది ఎంచేతో; కాని, చాలా మంచివాడు.

మేం కాలేజీ వ్యవస్థాపక విద్యార్థులం. మాకు సీనియర్సు లేరు. అంచేత సెషనల్ మార్కులు ఉంటాయని కూడా తెలీదు. మేస్టార్లంటే గౌరవమే కాని భయం ఉండేది కాదు. ఎలాగో ఒక్క ఉదాహరణ ఇస్తాను. మా క్లాసులు ఫిజిక్స్, కెమిస్ట్రీ గేలరీలో జరిగేవి. అయినా మాకు గేలరీచెక్కలమీద చెప్పుల్తోకాని బూట్లతోకాని రాసి చక్కని వాద్యసంగీతం సృష్టించవచ్చని తెలీదు-ఒక మేస్టారు చెప్పేదాకా. మనం ఎంతతెలివైన వాళ్ళమైనా గురువు సహాయం

ఉంటేకాని రాణించలేమని బుజువైంది! మాకు క్లాసుచెప్పే కెమిస్ట్రీ ప్రొఫెసర్ గారు (వందమంది విద్యార్థులకి ఆయన ఎప్పుడూ పాఠాలు చెప్పలేదేమో! మేమో మందలా కనిపించి ఉంటాం) ముద్దుగా "అబ్బాయిల్లారా! ఇది కెమిస్ట్రీ గేలరీ. నాణ్యమైన చెక్కతో తయారైనది. మీరు దబదబా బాదుతూ నడిచినా, బూట్లతో దానికి అదిమి పామినా చాలా చప్పుడవుతుంది . ." అంటూ ఇంకా ఏదో చెప్పబోతుంటే మేం వందమంది మీరింతవరకు విన్నది ఆచరణలో పెడితే చాలని తను చెప్పిందాంట్లో పదోవంతు శిష్యులు ఆచరించినా గురువు మురిసిపోతాడనే జ్ఞానంతో వెంటనే బూట్లున్నవాళ్ల బూట్లతోనూ, చెప్పల్స్ ఉన్నవాళ్లు చెప్పల్స్‌తోనూ గేలరీ ఫ్లోర్‌మీద రాయడం మొదలెట్టాం. అది ఎంత చక్కని ధ్వని! వందమంది ఆర్కెస్ట్రాతో ఎక్కడో శంకర్-జైకిషన్, రాజేశ్వరావులాంటి మహానుభావులు తప్ప మామూలువాళ్ళు సంగీతం కట్టలేరని విన్నాం. అందుకే కెమిస్ట్రీ మేస్టారు మా వాద్య సంగీతాన్ని వెంటనే ఆపమని ఆదేశించారు. అయినా మేం మానలేదు. కొందరు పాదరక్షలతో ఫిడేలు రాగాలు పలికిస్తుంటే, మరికొందరు ఉత్సాహవంతులు తబలా, డ్రమ్స్ మొదలైన వాద్యాలను పలికించారు. ఆరోజుకాపాఠం చాలని మేస్టారు వెళ్లిపోయారు.

1955 లో చేరి ఏ మేస్టర్లూ, ఒక్క సబ్జెక్టూ పూర్తిగా చెప్పకపోయినా మేం ఇంతవాళ్లమయ్యాం. ఇక్కడ ప్రొ॥ బి. ఆర్. రావుగారు చెప్పిన కథ గుర్తొస్తుంది. అమెరికాలో ఓ కాలేజీలో చదివే ఓ స్టూడెంట్‌కి అన్ని సబ్జెక్టుల్లోనూ నూటికి నూరు వచ్చాయి కాని ఒకదాంట్లో తొంభై తొమ్మిదే వచ్చాయట. ఆ మేస్టారు ఆశ్చర్యపోయి నా సబ్జెక్టులో సెంట్ రాలేదేం అని అడిగారుట. దానికతను 'ఓసారి నేను మీ క్లాస్‌కి వచ్చానండి.' అన్నాడుట. మాకు కోర్సులు క్లాసురూంలో పూర్తికాలేదు కాని ఛెడ చదివేవాళ్లం. దెయ్యాలకి కూడా భయపడకుండా.

ముందే చెప్పానుగా, మా హాస్టల్సు వార్ షెడ్స్. ఓసారి శ్రీ ఆరుద్ర నన్ను చూడ్డానికి వచ్చాడు. నేను రూంలో లేను. (ప్రొఫెసర్) రాధాకృష్ణ మూర్తి మాత్రం ఆరుద్రతో మాట్లాడి నేను రూంకి వచ్చాక 'ఆరుద్ర వచ్చాడ్రా. నీ కిమ్మన్నాడు' అని ఆయన రాసిన చీటీ నా చేతిలో పెట్టాడు. 'ఇంకేమైనా చెప్పాడా' అన్నాను. 'ఏమీ చెప్పలేదు. మన హాస్టల్స్‌ని చూసి "ఇవేమిటి? లేవెటరీలా" అని అడిగాడు' అన్నాడు రాధాకృష్ణమూర్తి.

అలాంటి హాస్టల్‌లో రూంకి ఆరుగురం ఉండేవాళ్ళం. దానికితోడు ఎండ, వాన, ఎర్రమట్టి, అప్పుడప్పుడు పాములు కూడా రూంకి వచ్చేవి. చోటు చాలక ఆర్ట్సు కాలేజీ (ఇప్పటి లా కాలేజీ) డాబామీద ఇద్దరం ముగ్గురం చేరి చదివేవాళ్లం. కేంపస్‌లో ఓదెయ్యం ఉందని మాకు తెలుసు. అయినా ప్రాణాలకు తెగించి ఆర్ట్సు కాలేజి, జెవిడి కాలేజీల పైకప్పు లెక్క అక్కడ చదివేవాళ్లమంటే దానికి కారణం మా క్రమశిక్షణ. క్రమశిక్షణ ఉంటేచాలు మనిషి ఏదైనా సాధించగలడు.

అలా చదవడం మూలానే నాకు ఫస్ట్‌క్లాస్ చాలా సులువుగా రావడమే కాకుండా దెయ్యాలు హాని చెయ్యవనే రహస్యం కూడా తెలిసింది. ఓరోజురాత్రి చదివిచదివి మసకబారిన కళ్ళతో కాలేజీడాబామీంచి దిగివచ్చి టవర్ క్లాక్‌ని చూస్తూ ఏదో (కథ కాబోలు) ఆలోచిస్తున్నాను.

బూట్ల చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడి అటు చూసాను. కేంపస్ దెయ్యం! నావేపే వస్తోంది. చదువుదామంటే నాకు ఆంజనేయ దండకం రాదాయె. 'చస్తే చస్తాంలే' అని అలాగే నిలబడి ఆమెవేపు నిదానంగా చూసాను. నా చూపుల నైశిత్యాన్ని తట్టుకోలేక (?) నా పక్కనుంచి వెళ్ళిపోయింది ఆమె. ఆదెయ్యం కూడ యూనివర్సిటీలో రీసెర్చి చేస్తోందనీ అంచేత నీరస పడిపోయిందనీ తరువాత కాని నాకు తెలీలేదు.

* * *

కెమిస్ట్రీ డిపార్టుమెంటు వరండాలో శుభ్రంగా కడిగిన బీకర్లు, ఫ్లాస్కులు, టెస్టుట్యూబులు ఆరపెట్టారు నేలమీద. మేం మేస్టారు రాలేదన్న ఉత్సాహంతో పరుగెడుతుండగా మాలో అగ్రగామి అయినవాడు ఒక గాజుపాత్రని తన్నేశాడు. అది కలకలరావంతో పదిముక్కలైంది. అంతే. మిగతావాళ్లంకూడా కాలికొకటి చొప్పున అక్కడ ఆరపెట్టిన గాజుపాత్రలను తన్నుకుంటూ వెళ్ళాం. ఏ ఒక్కడూ రెండు పాత్రల్ని పగలకొట్టలేదు. ఒకడు తన్నినదాన్ని మరొకడు తన్నలేదు. అదే క్రమశిక్షణ అంటే. మావిధి మేం నిర్వర్తించాం. అందులో గొప్పేమీ లేదు-అనే వినయభావంతో మేం ఎవరమూ వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాం. శ్రీ ఆర్. ఎన్. సోమేశ్వరరావు మాత్రం కమాండింగ్ ఆఫీసర్లా ఓసారి మాక్పషిని పరివేక్షించి "సెంట్ పర్సెంట్ సక్సెస్. ఒక్కటికూడా మిగల్లేదు. అన్నీ పచ్చడయిపోయాయి" అని మాకు తెలియజేసాడు.

ఈ సంగతి కెమిస్ట్రీ ప్రొఫెసర్ గారికి తెలిసింది. మర్నాడు మేం క్లాసులో ఉండగా వచ్చి "జెంటిల్ మెన్ . . ." అంటూ అభివందనలు తెలుపబోయాడు. మాకు పొగడ్తలంటే కిట్టదు. మేం బీకర్లు బ్యూరెట్లు అవీ పగలగొట్టినంత మాత్రాన మా బుజాలు పొంగిపోలేదు. ఇంకా సాధించవలసింది చాలా ఉంది. అందుకే ఆయన్ని మరేమీ మాట్లాడనీయకుండా బూట్ల సంగీతం ప్రారంభించాం. ఆ శబ్దానికి తిరుగులేదు. అందుకే కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీ రాజగోపాలన్ కూడా ప్రొఫెసర్ గారికి కనబడకుండా మొహం తిప్పేసి తెగనవ్వేశాడు. యువతరం కదిలింది.

కదలడం అంటే ఇలాఅలా కాదు. మా క్లాస్‌మేట్ ఒకడు (ప్రస్తుతం ప్రొఫెసర్) రాజగోపాలన్ సహృదయతను గుర్తించి, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కి వెళ్లడం పూర్తిగా మానుకున్నాడు. వాడికితోడు కర్నల్ శాస్త్రి. ఇద్దరూ అందరూ వెళ్లిపోవడంచేత ఖాళీగాఉన్న హాస్టల్ రూంలో కొమ్మూరి సాంబశివరావు నవలలమీద రీసెర్చి చేస్తూ గడిపేవారు. చివరకు పరీక్షలు వచ్చాయి.

మా బడుద్దాయి మా అందర్నీ అడిగి రికార్డులు చదివి ప్రాక్టికల్స్ థియొరెటికల్‌గా అర్థం చేసుకున్నాడు. ప్రాక్టికల్ కి ఎవరిదో రికార్డ్ కూడా పట్టుకెళ్ళి సబ్ మిట్ చేసి పరీక్ష బాగానే చేశాడు. వెళ్ళిపోతుండగా రాజగోపాలన్ కి అనుమానం వచ్చింది-'వీణ్ణెక్కడా చూసినట్లులేదే' అని. రికార్డ్ తెరిచి చూస్తే మరొకడి నెంబరు ఉంది. ఇదంతా ఓరకంట గమనించిన మన హీరో పరుగు లంకించుకున్నాడు. వెనకాల రాజగోపాలన్ పరుగెత్తాడు. యూనివర్సిటీ చరిత్రలోనే అదొక మరపురాని మనోహర దృశ్యం. రాజగోపాలన్ విద్యార్థులతో సమంగా పరుగులు పెట్టగల దిట్ట కనుకనే, ఈ యూనివర్సిటీని వదిలేసి వెళ్ళి చాలా ఉన్నతస్థాయి చేరుకున్నాడు. సరే మనవాడూ ప్రొఫెసరు అయ్యాడు.

మన విద్యావిధానం కేపిటలిస్టు ఫ్యూడల్ పద్ధతుల్లో నడుస్తోందనే లెఫ్టిస్ట్ వాదనలో నిజం లేకపోలేదు. వ్యక్తి ఆస్తిలాగానే సొంత అనేదానికి ప్రాధాన్యం ఎక్కువ ఇందులో. కాకపోతే ఎవరి రికార్డు వాళ్ళే రాయాలి, ఎవరి పరీక్ష వాళ్ళే రాయాలి అనే సూపర్‌స్టిషన్స్ ఎలా చొరబడ్డాయి? సామూహిక కృషి ఎందుకంత తక్కువగా ఉంది?

ఉదాహరణకి డ్రాయింగే చూడండి. మేం పాతభావాల ప్రాబల్యంతో ఎవరి డ్రాయింగులు వాళ్ళమే సొంతంగా గీసేవాళ్ళం. కాని అది తప్పని, ఈ మాస్ ప్రొడక్షన్ యుగంలో ఒకడు డ్రాయింగ్ గీస్తే మిగతావాళ్ళు దాన్ని అనుసరించవచ్చనీ మాకు తెలీలేదు. కాకినాడ విద్యార్థులతో పరిచయమయ్యాక తెలిసింది "గ్లాస్ ప్లేట్ టెక్నిక్". మనం ఓ పక్కని దేశాన్ని టెక్నికల్‌గా ముందుకులాగుతామంటూ జి.పి. టెక్నిక్‌కి మారకపోతే ఎలా?

జి.పి. టెక్నిక్‌కి అట్టే ఖర్చుండదు. కాని, లాభంమాత్రం అపరిమితం. డ్రాయింగ్ షీట్ అంత సైజున్న గ్లాస్ ప్లేట్ కొనాలి. అంతే. దానిక్రింద ఎలక్ట్రిక్ బల్బుకి చోటుండేలా దాన్ని టేబిలుమీద అమర్చాలి. ఎవరో గీసిన డ్రాయింగ్‌ని ప్లేటుమీద పెట్టి దానిమీద ఖాళీ డ్రాయింగ్ షీట్ పెట్టి అడుగునున్న బల్బు వెలిగించాలి. అడుగునున్న డ్రాయింగ్ గీతలు మన షీట్‌మీద స్పష్టంగా కనిపిస్తాయి. వాటిమీద పెన్సిల్తో మనం గీసేస్తే ఎంత పెద్ద డ్రాయింగేనా అరగంటదాటి పట్టదు.

మాకు అన్ని లేబరేటరీలు ఇక్కడ లేకపోవడం చేత కాకినాడ వెళ్ళి కొన్ని ప్రాక్టికల్స్ చేసేభాగ్యం కలిగింది. మాది కొత్త కాలేజీ; కాకినాడ కాలేజీ పదేళ్ళ వయసుది. అక్కడ హాస్టల్స్ గోడలమీద దూలాలమీద జూనియర్స్‌కోసం సీనియర్స్ రాసిన సందేశాలను మేం కృతజ్ఞతతో నిరాకరించాం. "ఎమ్ 1. చదవద్దు-సెప్టెంబర్‌కి ఉంచెయ్యండి." "హీట్ దండగ. ఛోయిస్‌లో వదిలేయచ్చు." "హైడ్రాలిక్ లేబ్‌కి లేట్‌గా వెళ్లండి፥ టక్ చేసుకోకుండా తప్పించుకోవచ్చు." "సర్వే క్యాంప్ యమకూపం. శ్రీ . . . . .ముర్దాబాద్."

అలాగే కాకినాడలో ప్రాక్టికల్స్‌లో ఉన్న సదుపాయాలన్నీ మేం వాడుకోలేకపోయాం. కార్పెంట్రీనుంచి మెషీన్ షాప్‌దాకా ఏ ట్రేడ్ లో పరీక్ష జరిగినా యింజనీరింగ్ కాలేజీకి ఎదురుగా ఉన్న ఐ.టి.ఐ. లో జాబ్‌ని సబ్‌మిట్ చేస్తే ఎన్ని మార్కులో !

ఇక్కడి విద్యార్థులకి స్వయంకృషిమీద మోజెక్కువ. కాపీలు చేసినా మరొకడి పేపర్లోంచి చేసేవారు కాదు. ఎవరి స్లిప్పులు వాళ్ళే రూంలో కష్టపడి తయారుచేసుకొని పట్టుకెళ్ళేవారు. అది మా నియమం (అదీ చేయ్యడానికి ఓపికలేని నాలాంటివాళ్ళే ఎక్కువనుకోండి.). మా నాలుగేళ్ళ చదువులోనూ స్వయంకృషి నియమాన్ని ఉల్లంఘించి ఎదటివాడి పేపర్లోంచి కాపీకొట్టిన ఏకైక విద్యార్థి చేసిన పాపానికి శిక్షగా మొదటిరోజే డిబార్ అయిపోయాడు. అతని సాహసానికి మేమంతా జోహార్లర్పించాం. అంత పెద్దవాడితో మాట్లాడే అర్హత మాకులేదని తోచి మాట్లాడ్డం మానేశాం.

ఒకడు ఇంటర్మీడియట్ దాకా ఒకలా ఉండచ్చు; బి. ఇ. లో మరోలా ఉండచ్చు; చదువయ్యాక మరోలా ఉండచ్చు. మొరటు హేతువాదుల లాగా మనం ఒకదశలో ఒకలా ఉన్న

మనిషిని చూసి భవిష్యత్తుని అలాగే ఉంటుందని అంచనా వేస్తే బోల్తాపడతాం. జీవితం సరళరేఖ కాదు. మాతో చదివే రాంబాబు చాలా గారంగా పెరిగాడేమో. అమ్మానాన్నల ఇల్లు విడిచి కాలేజీకి వచ్చిన మొదటి వారంరోజులూ ఏడుస్తూ కూర్చునేవాడు. ప్రతీ సెలవులయ్యాక ఇదే తంతు. "వీపింగ్ ఫిలాసఫర్" అని పేరెట్టాం. అతనిప్పుడు అమెరికాలో సెటిలయ్యాడని తెలిసింది. అలాగే అప్పుడు మొద్దులనిపించుకున్న మా క్లాస్‌మేట్స్ కొందరు తరువాత ఎంతో రాణించారు, ఉద్యోగ వ్యాపారాల్లో. ఎందుకంటే మహర్షి మహేష్ యోగి చెప్పినట్లు జీవితం నిత్య పురోగామి. ప్రతి మనిషిపురోగమిస్తాడు. అతనెప్పుడు నిన్నటికంటె నేడూ, నేటికంటె రేపూ మెరుగవుతాడు. ఒక మనిషిగతాన్ని చూసి అతని విలువకట్టడం మూర్ఖత్వం. అలాగని "చరిత్ర అడక్కు ; చెప్పేది విను" అనే 'అడవిరాముడు' డైలాగ్ ప్రకారం చరిత్ర చెప్పడం మానేస్తామా? ముమ్మాటికీ కాదు. మన కాలేజీ 'గతమెంతో ఘనకీర్తి' కలిగినది కాదు; అయినా అది దేశాభివృద్ధికి ఒక రహదారి అని చెప్పాలి. అందుకే ఈ లఘు చరిత్ర.

* * *

మన కాలేజీ 1955-59లో సైన్స్ కాలేజీలో భాగంగా ఉండేది. అప్పుడు యూనివర్సిటీ అంతటికీ ఒకడే ప్రిన్సిపాల్, ఒకటే స్టూడెంట్స్ యూనియన్ ఉండేవి. యూనియన్ ఎన్నికలలో విజయం అభ్యర్థి ఉపన్యాసం పైనే తప్ప కులం మతం వగైరా 'ఆధునిక' అర్హతలపై ఆధారపడేది కాదు. రాజకీయాలు గోడరాతల స్థాయికి ఎదగలేదు. విద్యార్థుల్లో కమ్యూనిస్ట్, కాంగ్రెస్, సోషలిస్ట్ సిద్ధాంతాల అధ్యయనం ఉండేది.

ఆ వాతావరణం నాకెంతో ఉపకారం చేసింది. కాలేజీలో చేరే నాటికి 'జ్యేష్ఠ'గా పేరు పడ్డ నేను యూనివర్సిటీ లైబ్రరీలోపడి అన్ని రకాల పుస్తకాలూ చదివేశాను. అదేకాలంలో వీరాజీ, గొల్లపూడి మారుతీరావు - ఫిజిక్స్ ఆనర్స్ చదివారు. మోదుకూరి జాన్సన్, కొలకలూరి, శ్రీభాను, కొండముది శ్రీరామచంద్రమూర్తి - ఆర్ట్స్ కాలేజీలోనూ, ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం, సిహెచ్. దుర్గాప్రసాదరావు, కవనశర్మ, ముదిగొండ వీరభద్రయ్య, పాలడుగు వెంకటేశ్వర రావు ఇంజనీరింగూ చదివారు. ఎ. ప్రసన్నకుమార్ (పొలిటిక్స్ ప్రొఫెసర్) అప్పుడో యేడాది యూనియన్ ప్రెసిడెంట్ అయ్యాడు. యూనివర్సిటీ నించి మా బేచ్ లో వచ్చినంతమంది రచయితలు ఇంకెప్పుడూ వచ్చినట్లు లేదు.

కల్చరల్ వీక్స్, నాటకాల పోటీలు, డిబేట్లు చాలా పెద్ద ఎత్తున, మహోత్సాహంతో జరిగేవి. విద్యార్థులు కొట్లాడుతారని మాకప్పుడు తెలీనే తెలీదు.

ఇలా ఉండగా 1956-57 కల్చరల్ వీక్స్ ప్రారంభం చేయడానికి శ్రీ శ్రీ వచ్చారు. ఆయన మహాకవి, మితభాషి. రెండే మాటల్లు చెప్పారు మాకు. "మీ కలకలలాడే ముఖాలను చూస్తుంటే నాకు ఆనందం కలుగుతోంది; దేశ పురోగతిలో నమ్మకం ఏర్పడుతోంది..." అలా.

శ్రీ శ్రీ మహాద్రష్ట; మేధావులకు మార్గదర్శి. ఎన్నో నేర్పాడు. నాకు ఏ ఉద్యోగం చెయ్యాలోకూడా నేర్పాడు అప్పుడు. ఆర్థికాభివృద్ధికి ఇంజనీరింగ్ కీలకమైనట్లే, దేశ సంస్కృతి అభ్యుదయం కలకలలాడే కాలేజీ విద్యార్థుల ముఖాలలో ఉంది అని కదా శ్రీ శ్రీ సందేశం.

నేను చదివిన కాలేజీలోనే చిరకాలం ఉండిపోవాలని, విద్యార్థుల కలకలలాడే ముఖాలతో కలకాలం గడపాలని ఆ క్షణంలో శ్రీ శ్రీ దగ్గరే నిశ్చయించుకున్నాను; ఉన్నాను!

(ఆంధ్రయూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మేగజైన్)

★